సాక్షి
జగిత్యాల

మంగళవారం : 29 : జూలై : 2025



గోదావరిలో శ్రావణ స్నానాలు

ధర్మపురి: శ్రావణమాసం సోమవారం సందర్భంగా గోదావరి భక్తులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు.



నృసింహాలయంలో భక్తుల రద్దీ

ధర్మపురి: శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా నృసింహాలయంలో భక్తుల సందడి నెలకొంది. స్వామివారి ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. కొన్ని చోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఆండాళ్ అమ్మవారికి పంచామృతాభిషేకం



పూజల్లో అర్చకులు, అధికారులు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ సప్తాహంలో భాగంగా సోమవారం ఆండాళ్ తిరునక్షత్రం నిర్వహించారు. గోదాదేవికి పంచామృతాభిషేకం నిర్వహించారు. విశేష భోగాలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రఘు, ఉప ప్రధాన అర్చకులు మారుతీ ప్రసాద్, రాంచంద్ర ప్రసాద్, అర్చకులు అనిల్ కుమార్, రాంచందర్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, పర్యవేక్షకులు అశోక్ పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల తిప్పలు



ఎఫ్‌పీవో ముందు రైతులు

ఇబ్రహీంపట్నం: మొక్కజొన్న రైతులు యూరియా కోసం తిప్పలు పడుతున్నారు. పంట చివరి దశకు చేరడంతో యూరియా తప్పనిసరి. అయితే ఎరువు దొరక్కపోవడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని సహజ ఎఫ్‌పీవోకు 450 బస్తాల యూరియా వచ్చింది. ఇందులో 150 బస్తాలను ఇబ్రహీంపట్నం రైతులు, 300 బస్తాలు అమ్మక్కపేట రైతులకు పంపిణీ చేసేందుకు సీఈవో శ్రీధర్ సిద్ధమయ్యారు. అయితే అప్పటికే రైతులు పెద్ద ఎత్తున ఎఫ్‌పీవోకు చేరుకున్నారు. కంపెనీలో సభ్యత్వం ఉన్నవారికే యూరియా ఇవ్వాలని గొడవకు దిగారు. దీంతో ఒక్కో రైతుకు ఆధార్, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్ తీసుకుని రెండుబస్తాల చొప్పున పంపిణీ చేశారు. కానీ.. చాలామంది రైతులకు యూరియా దొరకలేదు. ఇబ్రహీంపట్నం పీఏసీఎస్‌లో వారం క్రితం కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేసిన విషయం తెల్సిందే. ఓ రైతులకు ఎక్కువ బస్తాల యూరియా పంపిణీపై విచారణ కొనసాగుతోంది. ఆ సొసైటీకి యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

హైపటైటీస్‌ను నివారిద్దాం



ప్రశంసపత్రాలు అందిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

జగిత్యాల: హైపటైటీస్ నివారణ సాధ్యమేనని, నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. ఐఎంఏ హాల్‌లో వైద్యులతో సమీక్షించారు. హైపటైటీస్‌కు గురైన వారిలో జ్వరం, ఆకలి లేకపోవడం, నీళ్ల విరోచనాలు, కంటి భాగంలోని తెలుపు రంగు పసుపుగా మారడం వంటి లక్షణాలుంటాయన్నారు. ఇందులో ఏ, బీ, సీ, డీ, ఈ అనే ఐదు రకాలుంటాయని, కొందరిలో ఇవి ఉన్నట్లు కూడా తెలియదన్నారు. ఇది ముదిరితే ఇబ్బందేనని, మొదట్లోనే వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు హేమంత్, కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా హైపటైటీస్‌ను గుర్తించిన వారికి ప్రశంస పత్రాలు అందించారు.

'మధ్యాహ్న' బిల్లులను మినహాయించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న కార్మికులు

జగిత్యాలటౌన్: మధ్యాహ్న భోజన నిర్వహణ బిల్లుల చెల్లింపులను ఈ-కుబేర్ నుంచి మినహాయించాలని 5నెలల పెండింగ్ వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సులోచన మాట్లాడుతూ నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. కార్మికులకు రూ.పదివేల గౌరవవేతనం అందించాలని, యునిఫాం, ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు ముత్యాల గౌరమ్మ, వెల్మలపల్లి వెంకటాచారి, పద్మ, సరిత, గంగవ్వ, రుక్మ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మురుగుతోనే సావాసం

- ఇంకా తీయని డ్రైనేజీలు
- వర్షంనీటితో అస్తవ్యస్తం
- వ్యాపిస్తున్న వ్యాధులు
- బెంబేలెత్తుతున్న ప్రజలు



- ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లోగల ఆస్పత్రుల సమీపంలో ఉన్న డ్రైనే జీ. సరిగా లేకపోవడంతో నీరు రోడ్లపైకి వస్తోంది. ఇటీవలి ముసురుతో ఖాళీ స్థలా లు, డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. కాలువులు శుభ్రం చేసి ఆయిల్‌బాల్స్ వేస్తేనే వ్యాధులకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందని కాలనీవాసులు అంటున్నారు.



కాలనీల్లో పర్యటించి కాలువలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్



- ఇది జిల్లాకేంద్రంలోని మోతెరోడ్‌కు వెళ్లే సమీపంలోని డ్రైనేజీ. నీరు సాఫీగా వెళ్లకపోవడంతో మురుగునీరు నిలిచే ఉంటోంది. ఆ నీటిని తొలగించకుంటే దోమలు, పందులు స్వైర విహారం చేస్తాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



- ఇది బైపాస్‌రోడ్‌లో గల డ్రైనేజీ. అందులో చెత్తాచెదారం పడేయడం స్థానికులకు శాపంగా మారింది. సమీపంలో నివాసాలు, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే పిల్లలు, ప్రజలు వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. ఆ ప్రాంతమంతా క్లోరినేషన్ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



- ఇటీవలి వర్షాలకు సాయిబాబా ఆలయం ఎదుట గల డ్రైనేజీ పూర్తిగా నిండింది. కార్మికులు సిల్ట్ తీసినా నీరు సాఫీగా ప్రవహించడం లేదు. సమీపంలోని ఇళ్లలోకి చేరుతోంది. అధికారులు స్పందించి నీటిని బయటకు వెళ్లేలా చేసి క్లోరినేషన్ చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

- ఇది గోత్రాలకాలనీకి వెళ్లే రోడ్డు. ఇక్కడ డ్రైనేజీ లేదు. ఆ ప్రాంతమంతా కొట్టుకొచ్చిన చెత్తాచెదారంతో నిండిపోయింది. దుర్వాసన మధ్య కాలనీవాసులు ఉండలేకపోతున్నారు. దోమలు విపరీతంగా వస్తున్నాయి. అక్కడ డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కొన్ని విష పురుగులు వస్తున్నాయంటున్నారు.



జగిత్యాల: జిల్లాలో మూడురోజులుగా కురిసిన ముసురువానకే డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. మరోవైపు ఖాళీ స్థలాల్లోకి మురికినీరు చేరింది. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. సోమవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో మురుగుకాలువల్లో నీరు తగ్గినా.. మురుగు మాత్రమే అలాగే మిగిలిపోయింది. అధికారులు వెంటనే చర్యలు చేపట్టకపోతే వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. డ్రెయిన్‌లు సక్రమంగా లేకపోవడంతో కొట్టుకొచ్చిన చెత్త అంతా నిండిపోతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా అందులోనే వేస్తుండడంతో మురికినీరు ముందుకు కదలడం లేదు. వర్షం తగ్గుముఖం పట్టిన క్రమంలో నీరు కొద్దికొద్దిగా వెళ్లిపోయినా మురుగుతో కూడిన చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో దోమలు, ఈగలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సర్ఫరాజ్ అహ్మద్ అధికారులతో సమీక్షించి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీల్లో ఆయిల్‌బాల్స్ వేయించాలని ఆదేశించారు.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి

జిల్లాకేంద్రంలోని పారిశుధ్యంపై కలెక్టర్ సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం పలు మురికికాలువలను పరిశీలించి వెంటనే చెత్తాచెదారం తొలగించాలని, కాలువల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పిచ్చిమొక్కలు తొలగించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలనీయొద్దు



అధికారులతో మాట్లాడుతున్న సర్ఫరాజ్ అహ్మద్, చిత్రంలో అదనపు కలెక్టర్ లత, ఇతర అధికారులు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- గ్రామాలు, పట్టణాల్లో ఫాగింగ్ తప్పనిసరి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సర్ఫరాజ్ అహ్మద్

జగిత్యాల: గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రత్యేకాధికారి సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. వర్షాలతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, విస్తృతంగా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. నీరు నిలిచిన చోట వెంటనే ఆయిల్‌బాల్స్ వేయించాలని సూచించారు. తాగునీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, జ్వరాలు వచ్చిన వారిని వెంటనే ఆస్పత్రులకు తరలించాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిస్తే ఎలాంటి పరిస్థితుల్లనైనా స్పందించేలా ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు. వరద ప్రవాహం మీదుగా ప్రజల రాకపోకలు సాగించకుండా నిషేధం విధించాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎరువులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విస్తీర్ణం అధారంగా ఎరువులు అందించాలి

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు సాగు చేసిన పంటల విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు అందించాలని సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. ఎరువులు కొరత లేకుండా సరఫరా చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఎరువుల గోదాంను పరిశీలించారు. యూరియా విక్రయాలను పరిశీలించారు. జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, ఏడీఏ భాస్కర్, ఆర్డీవో మధుసూదన్ ఉన్నారు.

కొడిమ్యాల ఆస్పత్రి సందర్శన

కొడిమ్యాల: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సర్ఫరాజ్ అహ్మద్ సందర్శించారు. రోగుల ఓపీ, ఐపీ వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై తీసుకుంటున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు చేయాలన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ఎస్‌హెచ్‌వో రాజశేఖర్, స్థానిక వైద్యాధికారులు నరేష్, పరమేశ్వరి, ఆఫీస్ సిబ్బంది ఉన్నారు.

పాల ధర తగ్గడంతో నష్టపోతున్న పాడిరైతులు

- పాల ధర తగ్గుతోంది.. దాణా ఖర్చు పెరుగుతోంది
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పాలను చెక్ చేయాలి
- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



డెయిరీ ఫాంను పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్: పాల ధర తగ్గడంతో పాడి రైతులు నష్టపోతున్నారని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. పశువులకు అందించే దాణాకు మాత్రం ధర భారీగా పెరుగుతోందన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీదేవిపల్లి, కోనాపూర్ గ్రామాల్లోని రైతుల డెయిరీ ఫాంలను పరిశీలించారు. సారంగాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పొరుగు రాష్ట్రాల నుంచి పలు డైయిరీ కంపెనీలు రాష్ట్రానికి పాలు ప్యాకెట్ల రూపంలో తీసుకుంటున్నాయని తెలిపారు. ఇక్కడి కంపెనీలు రైతులకు లీటర్‌కు చెల్లించే ధర కంటే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పాలకు తక్కువ ధర చెల్లిస్తున్నాయని, ఈ క్రమంలో వాటి నాణ్యత చెక్ చేయాలని సూచించారు. లీటర్‌కు రూ.5 ప్రోత్సాహకం అందిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున హామీ ఇచ్చామని, ఇప్పుడు అమలు చేయాలని జీవన్‌రెడ్డి కోరారు. ఈ విషయంపై సీఎంకు లేఖ రాశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, శేఖర్, గంగారాం, మహిపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనక సోమేశ్వర కొండపై శ్రావణ సందడి



మల్లాపూర్ : మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపై శ్రావణ సందడి మొదలైంది. సోమవారం కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి వరదపాశం సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, అర్చకులు బల్యపెల్లి ప్రభాకరశర్మ, సోమేశ్వరశర్మ భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

బీసీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వినోద్ కుమార్

కొడిమ్యాల: బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్, బీజేపీకి చిత్తశుద్ధి లేదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరగా.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవి శంకర్‌తో కలిసి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ బీసీల పై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే ఇరుపార్టీల ఎంపీలు ఢిల్లీ పెద్దలను ఒప్పించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ ద్వారా ఆమోదం పొందవచ్చని తెలిపారు. రవి శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హామీల్లో ఏ ఒ క్కటీ నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం పోయిందని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ జె డ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎఫ్‌పీవోలు అండగా నిలవాలి

జగిత్యాలఅగ్రికల్చర్: ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌లు రైతులకు అండగా ఉండాలని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఎఫ్‌పీవోల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎఫ్‌పీవోల ద్వారా రైతులు పండించిన పంటలను ప్రాసెసింగ్ చేసి.. మార్కెటింగ్ చేయాలని సూచించారు. వరంగల్ కాకతీయ సహకార శిక్షణ సంస్థ ప్రతినిధి వెంకటేశ్వర్లు జిల్లాలో ఎంపికైన 16 ఎఫ్‌పీఓల సంఘాల ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. సహకార అధికారులు సుజాత, అసద్, నిజామొద్దీన్, సీఈఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



కల్యాణలక్ష్మీ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. సోమవారం మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో పర్యటించారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సీఎం చెప్పే అబద్ధాలు, కాంగ్రెస్ మోసపూరిత హామీలపై అన్నివర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మా జీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మా జీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన, మాజీ వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల్లో గోల్‌మాల్

- ఇళ్ల మార్పిడికి బాధితుల దరఖాస్తు
- యజమానుల ప్రమేయం లేకుండానే మరొకరి పేరిట
- బదిలీపై వెళ్లిన కార్యదర్శి చేతివాటం..?
- ఇబ్రహీంనగర్ (శ్రీరాముపల్లి)లో వెలుగులోకి



ఇబ్రహీంనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

గొల్లపల్లి: గొల్లపల్లి మండలంలోని ఇబ్రహీంనగర్ (శ్రీరాముపల్లి)లో పంచాయతీ రికార్డులకు భద్రత కరువైంది. ఇంటి మార్పిడి కోసం దరఖాస్తు సమర్పిస్తే ఆస్తి మార్పిడి కాపీ ఇచ్చి రికార్డులో నమోదు చేయక చేతివాటం ప్రదర్శించారు ఇక్కడి అధికారులు. డిమాండ్ రిజిస్టర్‌లో అసెస్‌మెంట్ల నంబర్లతో ఉన్న యజమానుల పేర్లు.. మరో ఏడాది మరొకరి ఇంటి యజమానుల పేరిట మార్పిడి అయ్యాయి. ఇదంతా ఇళ్ల యజమానులకే తెలియకుండా జరిగిపోవడం గమనార్హం. గతంలో ఇక్కడ పనిచేసిన కార్యదర్శి చేతివాటంతోనే ఇలాంటివి చోటుచేసుకున్నట్లు బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ తతంగాన్ని ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి సంబంధిత అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

అసలేం జరిగింది..?

ఇబ్రహీంనగర్ పంచాయతీ కార్యదర్శిగా 2021 ఏప్రిల్ 10న మల్లికార్జున్ విధుల్లో చేరారు. 2024 ఫిబ్రవరి 21వరకు పనిచేశారు. ఆ సమయంలో వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. గ్రామానికి చెందిన ముద్దం భూమయ్య చనిపోగా.. ఆయన కొడుకు మొండయ్య ఇంటినంబర్ 5-3కి మార్పిడికి ధ్రువీకరణపత్రాలతో దరఖాస్తు పెట్టుకున్నాడు. భూమయ్య పేరిటే రికార్డులో రాసి.. మార్పిడి చేసినట్లు ఆస్తిమార్పిడి పత్రం అందించాడు. ఈ విషయం బాధితులకు ఆలస్యంగా విషయం తెలియడంతో న్యాయం చేయాలని 2025 మార్చి 3న ప్రజావాణిలో ఫిర్యాదు చేసాడు మొండయ్య. విచారణ జరిపిన అధికారులు ఆన్‌లైన్ మార్పిడి చేయకుండా అనుమతి ఇచ్చినట్లు గుర్తించారు. ఫౌల్ట్రీ, ఫర్టిలైజర్, వ్యాపారుల వద్ద కూడా ఇలాగే చేసాడని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలా మోసపోయిన వారు గ్రామంలో 84 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. సదరు కార్యదర్శి డిమాండ్ రిజిస్టర్ కూడా మెయింటెన్ చేయలేదనే అధికారులు గుర్తించినట్లు సమాచారం.

పంచాయతీ కార్యదర్శి ప్రమేయం లేకుండానే..

ప్రస్తుతం కార్యదర్శిగా రాజ్‌కిషన్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన 2024 ఫిబ్రవరి 2న విధుల్లో చేరారు. ఈ ఏడాది మే 30న గ్రామానికి చెందిన బండారి రాజయ్య వచ్చి ఇంటి నంబర్ 1-29 బండారి బాలయ్య పేరు నుంచి బండారి సాయిలు పేరిట మార్పిడి జరిగిందా వాకబు చేశాడు. అలాగే ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి కూడా కొన్ని వివరాలు అడగడంతో కార్యదర్శి ఈ-పంచాయతీ పోర్టల్‌లోని ఆన్‌లైన్ డిమాండ్ రిజిస్టర్ పరిశీలించారు. అందులో 2024-25లో ఉన్న ఇంటి యజమానుల పేర్లు.. 2025-26లోని రిజిస్టర్‌లో చూస్తే 25 మంది పేర్లు వేరుగా ఉన్నట్లు గుర్తించారు. వాస్తవానికి ఎవరైనా ఇంటి యజమాని మరణిస్తే పేరు మార్పులు, చేర్పులు, మ్యూటేషన్ ద్వారా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించి.. సిటిజన్ సర్వీసెస్ లాగిన్‌లో ఈ-పంచాయతీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత పంచాయతీ కార్యదర్శి ఆన్‌లైన్ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. కానీ.. ఇక్కడ మాత్రం పంచాయతీ కార్యదర్శి ప్రమేయం లేకుండానే ఈ-పోర్టల్‌లో పేర్లు మారడం గమనార్హం. ఈ-పంచాయతీ పోర్టల్ లాగిన్ కార్యదర్శి వెబ్‌సైట్ నుంచి లేదా పంచాయతీ కమిషన్ లాగిన్‌లో తప్ప ఇతరత్రా అవకాశం ఉండదు. కానీ.. 25మంది ఇంటి యజమానుల పేర్లు కార్యదర్శి ప్రమేయం లేకుండానే మారడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది గతంలో ఇక్కడ పనిచేసిన కార్యదర్శి పనా..? లేకుంటే సైబర్ నేరగాళ్ల పనా..? అనేది తెలియాల్సి ఉంది. ఈ విషయం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం..


గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి వల్ల తాము మోసపోయామని బాధితులు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. ఓ ఉన్నతాధికారి ప్రమేయంతోనే విచారణలో జాప్యం జరుగుతోందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ రికార్డులకే భద్రత లేకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

ఒక్కరి పేరిటే చేసిండు



మేం ఇద్దరం అన్నదమ్ములం. మా అమ్మ లక్ష్మీనర్సు పదేళ్ల క్రితం చనిపోయింది. ఆమె పేరిట ఉన్న ఇంటి ఆస్తిని మా పేరిట చేయాలని అప్పటి కార్యదర్శి మల్లికార్జున్‌ను కోరితే ఇద్దరి దగ్గర డబ్బులు తీసుకుని మా అన్న పేరిటే ఉన్నదంతా చేసిండు. ఇప్పుడు మా అన్న ఇందిరమ్మ ఇల్లు కట్టుకుంటున్నడు. నా పేరిట జాగ లేక రాలేదు. ఇప్పటికీ ఆన్‌లైన్‌లో మా అమ్మ పేరే చూపిస్తోంది.
– పొనగంటి దేవయ్య

నా భర్త పేరు తొలగించారు



నా భర్త లక్ష్మీరాజం పదేళ్ల క్రితం చనిపోయిండు. ఇల్లు ఆయన పేరు మీదే ఉంది. ఘ ర్‌పట్టి కడుతున్నం. మార్చిలో కూడా చెల్లించిన. ఇంటిని నా పేరిట చేయాలని దరఖాస్తు పెట్టలేదు. ఆన్‌లైన్‌లో మాత్రం వేరే వ్యక్తి పేరిట చూపిస్తోంది. నాకు న్యాయం చేయాలి.
– జుంజుపెల్లి పోశవ్వ, ఇబ్రహీంనగర్

అధికారులకు ఫిర్యాదు చేశా



నా ప్రమేయం లేకుండా ఈ-పంచాయతీ పోర్టల్‌లోని ఆన్‌లైన్ డిమాండ్ రిజిస్టర్ 25 మంది ఇళ్ల యజమానుల పేర్లు మార్పిడి అయ్యాయి. దీనిపై పంచాయతీ శాఖ అధికారులు, పోలీస్, సైబర్ క్రైం అధికారులకు ఫిర్యాదు చేశాం. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.
– రాజ్‌కిషన్, పంచాయతీ కార్యదర్శి

ఉన్నతాధికారులకు నివేదించా

ఆస్తి మార్పిడికి దరఖాస్తు చేసుకుంటే పత్రం ఇచ్చి.. రికార్డులో నమోదు చేయలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. కొందరు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. వారి ఇళ్లకు వెళ్లి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. కార్యదర్శి ఫిర్యాదుతో రిజిస్టర్లను పరిశీలిస్తే 25 మంది పేర్లు మారినట్లు గమనించాం.
– సురేష్ రెడ్డి, ఎంపీవో, గొల్లపల్లి

క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేందర్‌రెడ్డి

గన్నేరువరం(మానకొండూర్): మండల కేంద్రంలో అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. పబ్బతి చంద్రయ్య (40) ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఐదునెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి ముందున్న చెట్టుకు ఉరేసుకున్నాడు. భార్య ప్రమీల ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

అమెరికాలో సింగరేణి కార్మికుడి మృతి

- ఇండియాకు శవాన్ని తీసుకొచ్చే యత్నంలో బంధువులు


పెరక ప్రకాశ్ (ఫైల్)

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-3 పరిధిలోని ఓసీపీ-2లో పని చేస్తు గోదావరిఖనిలో పవర్ హౌస్ కాలనీలో నివాసముంటున్న పెరక ప్రకాశ్(54) అమెరికాలో ఇటీవల మృతి చెందాడు. ఆయన కూతురు అమెరికాలోని అస్టిన్ నగరంలో ఉండగా.. అక్కడికి వెళ్లి మరణించాడు. మృతదేహాన్ని ఇండియాకు పంపించడానికి అక్కడి బంధువులు గోఫండ్‌మీ పేజీ ఏర్పాటు చేసి సాయంకోసం ఎదురుచూస్తున్నారు. అక్కడి తానా ప్రతినిధులతో మాట్లాడి శవాన్ని గోదావరిఖనికి తీసుకురావాలనే యోచనలో బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉండగా, చిన్న కూతురి వద్దకు వెళ్లిన సమయంలో ఈసంఘటన జరిగింది.

గంజాయి తరలిస్తున్న బాలుడిపై కేసు

వెల్గటూర్: గంజాయి తరలిస్తున్న బాలుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. మండలంలోని మొక్కట్రావుపేట శివారులో పోలీస్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ బాలుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని తనిఖీ చేయగా 110 గ్రాముల గంజాయి దొరికింది. బాలుడిది ముత్తునూర్ గ్రామంగా గుర్తించారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏడుగురిపై..

మెట్‌పల్లి: మెట్‌పల్లి క్లబ్ సొసైటీ స్థల విక్రయ వ్యవహారంలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. క్లబ్ ఆస్తులను గుట్టుగా విక్రయించి మోసానికి పాల్పడుతున్నారని దొంతుల వెంకటేశ్వర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధ్యక్షుడు చెట్లపల్లి నరేందర్‌గౌడ్‌వ గంగుల వివేక్, వేముల కిషన్, దొంతుల సుధాకర్, వేముగంటి భూమేశ్వర్, నీల రాజు, వేముల అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సారెస్పీపైనే ఆశలు

- భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టులోకి నీరు
- 23.866 టీఎంసీలకు చేరిన నీటిమట్టం
- నీరు విడుదల చేయాలని రైతుల డిమాండ్


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

జగిత్యాల అగ్రికల్చర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సాగు, తాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద చేరుతోంది. ఆయకట్టుకు విడుదల చేసేస్థాయిలో ప్రాజెక్టు నీటిమట్టం పెరగకపోవడంతో, నీటి విడుదలపై సందిగ్ధం నెలకొంది. మొన్నటి వరకు వర్షాలు లేక, పంటలు ఎండిపోతుండటంతో నీరు విడుదల చేయాలని జిల్లాలోని కథలాపూర్, మెట్‌పల్లి రైతులు ఆందోళనకు దిగారు.

➡ ఎగువప్రాంతాల్లో వర్షాలు అంతంతే

ఎస్సారెస్పీ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పెద్దగా లేకపోవడంతో నీరు చేరడం లేదు. రెండేళ్లలో జూలై నెలలోనే ప్రాజెక్టు నిండింది. జిల్లా ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సాగునీరు ఇచ్చారు. ప్రాజెక్టుకు చెందిన కాకతీయ, సరస్వతి, లక్ష్మీ కాలువలకే కాకుండా వరదకాలువకు సైతం పలుమార్లు నీటిని వదిలారు. ప్రాజెక్టు నిండిన తర్వాత ఐదారుసార్లు గేట్లు ఎత్తి వరదను గోదావరిలోకి వదిలారు.

➡ జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో సాగు

జగిత్యాల జిల్లాలో వానాకాలం సీజన్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగుకానున్నాయి. ఇందులో వరి 3 లక్షల ఎకరాల్లో సాగుచేసే అవకాశముంది. వరికి సాగునీటి అవసరం ఎక్కువ. ప్రస్తుతం వ్యవసాయ బావుల్లో ఉన్న నీటితోనే వరి నాట్లు వేస్తున్నారు. ప్రాజెక్టు నిండుతుందనే ఆశతో రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పుడే వరద వచ్చే అవకాశం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ బావుల్లో ఉన్న నీరు సైతం ప్రధాన పొలం దున్నేందుకు సరిపోవడం లేదని చెపుతున్నారు. లక్షన్నర ఎకరాల్లో సాగయ్యే మొక్కజొన్న, పసుపు పంటలకు వర్షం నీరు సరిపోతుంది. తప్పని పరిస్థితుల్లో డ్రిప్ ద్వారా సాగునీరు అందిస్తున్నారు.

➡ ప్రాజెక్టులో 23.866 టీఎంసీలు

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091.00 అడుగులు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 1070.30 అడుగుల నీరుంది. నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీ(గతంలో 90.3 టీఎంసీ)లకు ప్రస్తుతం 23.866 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టులోకి ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి 13.045 టీఎంసీల నీరు చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సగటున ప్రాజెక్టులోకి 10,484 క్యూసెక్కుల నీరు చేరుతోంది. గతేడాది ఈ సమయానికి ప్రాజెక్టు నీటి మట్టం 1073.60 అడుగులు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 29.933 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 50,503 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 622 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో వెళ్తోంది.కాగా.. కథలాపూర్, మెట్‌పల్లి ప్రాంత రైతులు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని ఆందోళన చేస్తున్నారు.

ఎదురుచూస్తున్నాం



ఎస్సారెస్పీ ప్రాజెక్టు జిల్లాకు వరప్రదాయినీ. ఈ ప్రాజెక్టు ద్వారా జగిత్యాల జిల్లాకే ఎక్కువ నీరు అందుతుంది. ప్రాజెక్టు నీరు రాకపోతే పంటలు సాగుచేయడం కష్టం. చాలామంది వరినాట్లు వేసి ఎస్సారెస్పీ నీటి కోసం ఎదురుచూస్తున్నారు.

– వేముల కరుణాకర్, ధర్మపురి

ప్రాజెక్టు నిండాలి



ఖరీఫ్ సీజన్‌కు ఆన్, ఆఫ్ పద్ధతిలో ఎస్సారెస్పీ నీరు విడుదల చేయాలి. ఇప్పటి వరకు వ్యవసాయ బావిలో ఉన్న నీటితో నాట్లు వేసుకున్నాం. బావుల్లో సరిపోయేంత నీరు లేదు. ప్రాజెక్టు తొందరగా నిండి, వానాకాలం, యాసంగి పంటలకు నీరు అందించాలి.

– నక్కల తిరుపతి రెడ్డి, తొంబరావుపేట, మేడిపల్లి

‘ప్రజావాణి’కి దరఖాస్తుల వెల్లువ


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లత, ఇతర అధికారులు

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బీఎస్.లత బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై 93మంది తరలివచ్చి ఫిర్యాదు చేశారు. వాటిని పరిశీలించిన అనంతరం లత మాట్లాడుతూ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీవో రఘువరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్రీడా మైదానానికి స్థలం కేటాయించండి



జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్‌లో క్రీడా మైదానం లేదు. వాకింగ్, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ ఆడేందుకు మైదానం లేక ఇబ్బంది పడుతున్నాం. ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులకు పలుమార్లు విన్నవించాం. మేజర్ పంచాయతీ అయిన చల్‌గల్‌లో క్రీడామైదానం ఏర్పాటు చేస్తే మోరపల్లి, చర్లపల్లి, హస్నాబాద్, తాటిపల్లి ప్రజలకు వాకింగ్‌తో పాటు క్రీడలు ఆడేందుకు సౌకర్యంగా ఉంటుంది.

– చల్‌గల్ గ్రామ యువకులు

రోడ్లు వేయండి



భవానీనగర్ కాలనీని అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షం పడితే రోడ్లన్నీ బురదలా మారుతున్నాయి. కొన్ని కాలనీల్లో రోడ్లు ఉన్న చోటే తిరిగి రోడ్లు వేస్తున్నారు. మా కాలనీలో మాత్రం పట్టించుకోవడం లేదు. వివక్ష లేకుండా మా కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించండి.

– భవానీనగర్ కాలనీ, జగిత్యాల

జనరేటర్‌తో ట్రాఫిక్‌జాం



జిల్లాకేంద్రంలోని కొత్త బస్టాండ్ సర్కిల్‌లో మంచాల కృష్ణ పెట్రోల్ బంక్ జనరేటర్ రూం రోడ్డుకు అడ్డంగా ఉంది. ట్రాఫిక్‌తో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదు. జనరేటర్ రూంను తొలగించాలి. యావర్‌రోడ్డును విస్తరించాలి.

– బీజేపీ నాయకులు

ఫేక్ డాక్యుమెంట్లతో బెదిరింపులు



బీర్‌పూర్ పరిధిలోని సర్వే నంబర్ 333/1/1, 333/2లోని స్థలాన్ని నిజామాబాద్ జిల్లా నూతిపెల్లికి చెందిన దేవర సంజీవరాజు, తండ్రి రాంజీవన్‌రావు వద్ద డీ–1ఫాం సర్టిఫికెట్ ఆధారంగా 2009లో 44 మందిమి రెండు గుంటల చొప్పున కొన్నాం. ఆ స్థలంలో రేకుల షెడ్లు నిర్మించుకుని 16 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాం. ఇటీవల వంగపెల్లి చంద్రశేఖర్‌రావు అనే వ్యక్తి ఫేక్ డాక్యుమెంట్లు చూపుతూ ఈ స్థలం తనదని, ఖాళీ చేయాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ బెదిరిస్తున్నాడు. చంద్రశేఖర్‌రావు నుంచి ఇళ్లు, ప్రాణాలకు రక్షణ కల్పించాలి.

– ఎస్సీ కులస్తులు, బీర్‌పూర్

భూమి రిజిస్ట్రేషన్ నిలిపివేయండి



మా అమ్మ చనిపోయింది. మా నాన్న విదేశంలో ఉంటున్నాడు. మా బాగోగులు చూడటం లేదు. అక్కా చెల్లెళ్లిద్దరం అమ్మమ్మతో ఉంటున్నాం. మా అమ్మ చావుకు కారణమైన మా తాత, నానమ్మ మా నాన్న వాటా కింద రావాల్సిన భూమిని అక్రమంగా విక్రయించినట్లు మా బంధువుల ద్వారా తెలిసింది. రేచపల్లి శివారులోని సర్వే నంబర్ 5273/2/4/1/1లోని 1.06 ఎకరాలు, సర్వే నంబర్ 530/జి/1లోని 0.374 గుంటల భూమిని మాకు తెలియకుండా అమ్మకానికి పెట్టారు. అమ్మ లేక.. నాన్న పట్టించుకోక అనాథలమైన మాకు ఏకైక జీవనాధారమైన ఆ భూమిలో ఎలాంటి క్రయవిక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోండి.

– మౌనిక చైత్ర, ఇయాన్సి, రేచపల్లి

సరస్వతీ పుత్రునికి అందిన లక్ష్మీకటాక్షం

- ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన పీఏ మురళీధర్ రెడ్డి
- స్పందించి సాయం చేసిన నేతలు


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: కూలిపనులు చేసుకుంటూ బతికే మానకొండూరు మండలం గంగిపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ–శంకర్ దంపతుల కొడుకు మహేశ్ గత ఏప్రిల్‌లో విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా 453 (ఎస్సీ విభాగంలో 17)వ ర్యాంకు సాధించాడు. తమిళనాడులోని తిరుచిరాపల్లి ఎన్‌ఐటీలో ఆర్కిటెక్చర్ సీటు దక్కించుకున్నాడు. ఫీజుకట్టలేని పరిస్థితిలో తల్లిదండ్రులు ఉండడంతో మహేశ్ విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణ పీఏ మురళీధర్ రెడ్డి విద్యార్థికి ఎలాగైనా సహాయం చేయాలని తలిచి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, అధికారుల సహకారంతో రూ.3.30 లక్షలు సమీకరించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో విద్యార్థి మహేశ్‌కు అందజేశారు. ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో పేదలకు సాయం చేయాలని, విద్యార్థికి ఆర్థిక సాయం చేసిన దాతలు అభినందించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులికృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఎస్‌ఎల్ గౌడ్, ఒగ్గు దామోదర్, బండారి రమేశ్, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, మోరపల్లి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆడుకుంటూ వెళ్లి.. నీటిబకెట్‌లో పడి..


సాన్వీ(ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): సరదాగా ఆడుకుంటూ వెళ్లిన చిన్నారి గుండు సాన్వీ(21నెలలు) నీటిబకెట్‌లో పడి చనిపోయింది. పెద్దపల్లి జిల్లా పెద్దాపూర్ గ్రామంలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దాపూర్ గ్రామానికి చెందిన గుండు సతీశ్ – రవళి దంపతులు. వీరికి ఒక మారుడు, ఒక కూతురు ఉన్నారు. కొడుకు పెద్దవాడు, కూతురు సాన్వీ ఇంట్లో సందడిచేస్తూ ఉండేది. ఈక్రమంలోనే ఈనెల 27న రాత్రి 7.00 గంటల సమయంలో ఇంట్లో ఆడుకుంటోంది. చిన్నారి తల్లిదండ్రులు ఇంటి పనుల్లో నిమగ్నయ్యారు. అయితే, ఇంట్లో ఆడుకుంటూ క్రమంగా బయటకు వెళ్లింది. ఆ తర్వాత ఇంటి ఆవరణలోనే ఆడుకుంటూ సమీంలోని నీటి బకెట్ వద్దకు చేరుకుంది. అక్కడ నీటిని చేతితో తాకేందుకు యత్నించగా బకెట్‌లో తలకిందులుగా పడిపోయింది. ఆ వెంటనే గమనించిన చిన్నారి పెద్దనాన్న నరేశ్ కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

దుబ్బ రాజన్నకు భక్తుల తాకిడి



సారంగాపూర్: శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా దుబ్బరాజన్న ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి అభిషేకాలు, కోడె మొక్కులు, కుంపటి మొక్కులు, గండదీపం, నిలువెత్తు బంగారం సమర్పించారు. ఆలయ ఈవో అనూష, వ్యవస్థాపక ధర్మకర్త శంకరయ్య, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలింపు

– ఆత్మకూర్ రీచ్ నుంచి 29 ట్రాక్టర్ల తరలింపు


ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

మెట్‌పల్లి రూరల్: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను సరఫరా చేసింది. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ రీచ్ నుంచి 10 మంది లబ్ధిదారుల కోసం 29 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక తీసుకెళ్లినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇసుక పక్కదారి పట్టకుండా రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు. ముందుగా వాగు నుంచి ఇసుక తీయొద్దని కొందరు గ్రామస్తులు అడ్డగించడంతో రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకున్నారు. అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో శాంతించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక కోసం ఎలా దరఖాస్తు చేయాలో తెలియకపోవడంతో ఈనెల 25 న ‘ఇందిరమ్మకు ఉచిత ఇసుక’ శీర్షికన ‘సాక్షి’ కథనం ప్రచురించింది. దీంతో చాలామంది లబ్ధిదారులు పంచాయతీ, రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో అధికారులు వారికి ఇసుకను సరఫరా చేశారు.

రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ వినతి


కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న కరీంనగర్–జగిత్యాల రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన ఆయన కరీంనగర్–జగిత్యాల విస్తరణ పనులతో పాటు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ (సీఆర్‌ఐఎఫ్) మంజూరు అంశాలపై చర్చించారు. కరీంనగర్ నుంచి జగిత్యాల వరకు ఫోర్ లేన్ విస్తరణకు ఎన్నికలకు ముందే కేంద్రం రూ. 2151 కోట్ల 35 లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించిన విషయాన్ని గుర్తుచేశారు. త్వరలోనే విస్తరణ పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పలు రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్‌ఐఎఫ్) ను విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. మొత్తం రూ.113 కోట్లతో కూడిన సీఆర్‌ఐఎఫ్ ప్రతిపాదనలను గడ్కరీకి సమర్పించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట–ఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హై లెవల్ బ్రిడ్జితోపాటు గన్నేరువరం మండలం గుండ్లపల్లి–పొత్తూర్ రోడ్డు విస్తరణ పనులు, చందుర్తి నుంచి మోత్కురావుపేట వరకు వంతెనల నిర్మాణ పనులు, కిష్టంపల్లి వరకు రోడ్డుపై వంతెన నిర్మాణ ం, శంకరపట్నం మండలం అర్కండ్ల (గ్రామం) నుంచి కన్నాపూర్ (గ్రామం) వరకు వరద కాలువపై హై లెవల్ వంతెన నిర్మాణ ప్రతిపాదనలు వీటిలో ఉన్నాయి. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే సీఆర్‌ఐఎఫ్ నిధులు విడుదలపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ముదిగొండ అమరుల స్ఫూర్తితో ఉద్యమిస్తాం

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రసాద్

కరీంనగర్: ముదిగొండ అమరవీరుల స్ఫూర్తితో పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాల కోసం సమరశీల ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ముకుందలాల్ మిశ్రాభవన్‌లో మాట్లాడారు. ముదిగొండలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆందోళన చేస్తే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపై తుపాకీ తూటాల వర్షం కురిపించి ఏడుగురిని కాల్చి చంపిందన్నారు. పాలకులు మారినా పేదల జీవితంలో మార్పు రావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చే ముందు అందరికీ ఇళ్లు ఇస్తామని హామీలను విస్మరించిందని, ఇంటి స్థలం కోసం పోరాటం చేసిన పేదలపై కేసులు పెట్టిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇంటి స్థలం ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా పేదలందరికీ ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వాసురెడ్డి, సుంకరి సంపత్, భూతం సారంగపాణి, వడ్ల రాజు, కవ్వంపల్లి అజయ్, మాతంగి శంకర్, రాయికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోశాల.. గోస తీరేనా.!

- మర్రిపల్లిలో 50 ఎకరాల్లో గోశాల
- అనుమతుల రాగానే నిర్మాణ పనులు
- కేబినెట్ ఆమోదంతో హర్షంవ్యక్తం చేస్తున్న భక్తులు


తిప్పాపూర్‌లోని గోశాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వేములవాడరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు కొత్త పథకాలను ప్రవేశపెడుతోంది. రాష్ట్రంలోని గోశాలల్లో అధునాతనమైన గోశాలను నిర్మించాలని ఇందుకు 21 ప్రాంతాలను ఎంపికచేసింది. అందులో భాగంగానే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో ఉన్న గోశాలను 50 ఎకరాల స్థలంలో నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. గోవుల పోషణ, సంరక్షణకు పశుసంవర్ధక, రెవెన్యూ, దేవాదాయ శాఖల భూముల్లో ఈ గోశాలను నిర్మించాలని ఇంతకుముందు జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. రాజన్న ఆలయ గోశాల కోసం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలోని 748 సర్వేనంబర్‌లో 50 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ శాఖ అధికారులు ఇప్పటికే గుర్తించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఈ ప్రాంతంలో గోశాల నిర్మించనున్నారు.

ఏటా కోట్లాది రూపాయల ఆదాయం..

రాజన్నకు భక్తులు మొక్కుబడిగా కోడెలు సమర్పిస్తారు. కొందరు ఆలయంలో కోడె మొక్కులు చెల్లించుకుంటారు. కోడె మొక్కులతో ఏటా ఆలయానికి కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరుతోంది. తిప్పాపూర్‌లో మూడెకరాల స్థలంలో దాదాపు 400 కోడెలు ఉంటాయి. ఆలయంలో భక్తుల మొక్కు చెల్లింపుల కోసం సమీపంలోని గోశాల వద్ద కొన్ని కోడెలు సిద్ధంగా ఉంచుతారు. వీటి సంరక్షణ కోసం ఏఈవో స్థాయి అధికారి పర్యవేక్షణలో కోడెల బాగోగులు చూసుకుంటారు. భక్తులు పశుగ్రాసం వితరణగా అందిస్తారు. ఇటీవల వరుసగా కోడెలు మృత్యువాత పడటంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక దృష్టి సారించారు. రాజన్న గోశాల కోసం ప్రత్యేకంగా అధునాతనమైన గోశాల నిర్మించాలని ఎమ్మెల్యే సీఎంకు వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడ గోశాల కోసం 50 ఎకరాల స్థలం గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు మర్రిపల్లిని 748 ప్రభుత్వ స్థలాన్ని 50 ఎకరాలుగా గుర్తించి అందులో హద్దులు ఏర్పాటు చేశారు.

కోడెలను సంరక్షించాలి



భక్తులు సమర్పించే నిజ కోడెలు గోశాలలోనే ఉంచి సంరక్షించాలి. కోట్ల ఆదాయం ఉన్న ఆలయానికి కోడెల సంరక్షణ సమస్య కాదు. వాటి కోసం ప్రత్యేక నిధులు, సిబ్బందిని కేటాయించి వాటి బాగోగులు చూడాల్సిన బాధ్యత ఆలయ అధికారులపై ఉంది.

– గడప కిశోర్‌రావు, విశ్వహిందూ పరిషత్ సహాయ కార్యదర్శి, కరీంనగర్ జిల్లా

50 ఎకరాల్లో నిర్మాణం



రాజన్న ఆలయానికి ఏటా రూ.123 కోట్ల 76 లక్షల ఆదాయం వస్తుంది. దాదాపు 68 శాతం కోడెమొక్కుల ద్వారా సమకూరుతుంది. కోడెల సంరక్షణకు గత ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మర్రిపల్లి శివారులో గోశాల కోసం 50 ఎకరాల్లో నిర్మించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

– చిలుక రమేశ్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి